

సాక్షి
బాపట్ల
గురువారం । 10 । అక్టోబర్ । 2024




పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ

అచ్చంపేటఃపులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,364 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,247 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 588.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7026 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 320 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

చదువుల తల్లిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ దేవిగా భక్తుల పూజలందుకున్నారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో, సీతాసమేత శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో అమ్మవారికి సరస్వతీ దేవి అలంకారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.



అడుగులు వడివడిగా.. ఇంద్రకీలాద్రి నిండుగా.. భక్తజనం ఉప్పొంగగా.. అందరి మదిలో అమ్మ రూపం అపురూపంగా కొలువుదీరింది. బుధవారం దుర్గమ్మ జన్మ నక్షత్రం మూలానక్షత్రం కావడంతో దారులన్నీ ఇంద్రకీలాద్రి వైపు నడిచాయి. సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ తన బిడ్డలకు దర్శనమిచ్చింది. భక్తజనం మదిలో దివ్యానందం నింపింది. ఉదయమంతా భక్తి పారవశ్యం, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలతో ఇంద్రగిరి మెరిసిపోయింది.

బుధవారం తెల్లవారుజామున మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్ వద్ద వేచి ఉన్న భక్తులు. (ఇన్‌సెట్)సరస్వతీ అలంకారంలో దుర్గమ్మ

విద్యాధరి.. భక్తఝరి

సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మకు నీరాజనం

- మంగళవారం అర్ధరాత్రి నుంచే బారులు తీరిన భక్తులు
- 21 గంటల పాటు అమ్మవారి దర్శనం
- చదువుల తల్లికి పలువురు ప్రముఖులు పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో ఏడో రోజు దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 00.50 అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం దర్శనం ప్రారంభమైంది. అమ్మవారిని సరస్వతీదేవిగా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్ దంపతులు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఈవో కేఎస్ రామరావు దంపతులతో పాటు దేవదాయ శాఖకు చెందిన పలువురు అధికారులు దర్శించుకున్నారు.

పోలీసుల అతి..

మూలా నక్షత్రం కావడంతో దేవస్థానం టికెట్ల విక్రయాలను రద్దు చేసి అన్ని క్యూలైన్‌లోనూ భక్తులను ఉచితంగా అనుమతించారు. ఘాట్‌రోడ్డులో కొండపైకి వస్తున్న భక్తులను పోలీసులు నియంత్రించే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఓ మహిళకు పోలీసు అధికారి చేయి బలంగా తగలడంతో ఆ భక్తురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వినాయకుడి గుడి అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచహారతుల నేపథ్యంలో గంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో రద్దీ మరింత పెరిగింది. రాత్రి 12 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రికార్డు స్థాయిలో అమ్మవారి దర్శనం కల్పించినట్లయింది. అమ్మవారికి బాలభోగ నివేదన, మహానివేదన, పంచహారతుల సమయం మినహాయిస్తే 21 గంటల పైగా అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల క్యూ

ఆర్జిత సేవలలో ఉభయదాతలు

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం ఘాట్‌రోడ్డు మీదగా వచ్చే అన్ని వాహనాలను నిలిపివేసింది. ఉభయదాతల కోసం గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, పున్నమీ, భవానీ ఘాట్ల నుంచి దేవస్థానం బస్సులను నడిపింది. దీంతో ఉభయదాతలు దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. వీఐపీల పేరిట వచ్చే వారిని పూర్తిగా కట్టడి చేశారు. క్యూలైన్ బయట నుంచి ఎవరూ కొండపైకి చేరుకోకుండా పోలీసులు ఘాట్‌రోడ్డులో పలు చోట్ల స్కానింగ్ చేయడంతో క్యూలైన్లలో భక్తులు త్వరత్వరగా అమ్మవారిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా..

శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ బుధవారం కన్నుల పండువగా సాగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఊరేగింపును ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఆది దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య నగరోత్సవ సేవ అంగరంగ వైభవంగా సాగింది. మహా మండపం, కనకదుర్గానగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద దేవతా మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



నగరోత్సవంలో ఉత్సవమూర్తులు



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు, లోకేష్ దంపతులు

సీఎంకు స్వాగతం

దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు దంపతులను కలెక్టర్ సృజన మర్యాద పూర్వకంగా కలిశారు.

15లోగా సహకార సంఘాల కంప్యూటరీకరణ

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట: జిల్లాలోని సహకార సంఘాల కంప్యూటరీకరణ అక్టోబరు 15లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మూడవ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కారుమంచి, బొల్లాపల్లి సహకార సంఘాలకు మంజూరైన పెట్రోలు బంకులు వెంటనే ప్రారంభించేలా చూడాలని సూచించారు. నాదెండ్ల సహకార సంఘం నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి జన ఔషధీ కేంద్రాల్లో తక్కువ ధరకు ఔషధాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి, అమ్మకాలు పెంచాలని తెలిపారు. ఈపూరు, నరుకుళ్లపాడు, శాల్యాపురం, కారుమంచి జనఔషధీ కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో సహకార సంఘాల నేతృత్వంలోని శీతల గిడ్డంగుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటికే నిర్వహిస్తున్న బహుళ ప్రయోజన గిడ్డంగులను అద్దెకు ఇచ్చే విషయంలో ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు జీఎం అజయ్‌కిషోర్, నాబార్డ్ డీడీఎం శరత్, జిల్లా మత్స్య అధికారి సంజీవరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు, పంచాయతీ రాజ్ శాఖ ఏవో జయకృష్ణ, సహకార అధికారులు శ్రీనివాసరావు, నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.

మధుశాలినికి అభినందనలు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 బాలికల రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పట్టణానికి చెందిన కుంచాల మధుశాలినికి బుధవారం ఏసీఏ మాజీ క్రీడాకారుడు ఆర్.దుర్గాప్రసాదు క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. మహిళా క్రికెట్‌లో మధుశాలిని నిరంతర కృషితో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మాజీ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో బాలుడి గల్లంతు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది వద్ద కృష్ణా నదిలో బాలుడు నీటమునిగి గల్లంతైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది.పోలీసులు సమాచారం ప్రకారం.. మండల పరిదిలోని మల్లాది ఎస్సీ కాలనీకి చెందిన నందూరు సామియేలురాజు(16) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి కృష్ణానదిలో ఈత కొట్టటానికి వచ్చాడు. ఈ సమయంలో నదిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, నదిలో సామియేలురాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించలేదు. ప్రస్తుతం పోలీసులు, గజ ఈతగాళ్లు గాలిస్తూనే ఉన్నారు.

ఘనంగా 'పల్లె పండుగ' వారోత్సవాలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: 'పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు' జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పంచాయితీ వారోత్సవాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని పండుగ వాతావరణంలో ప్రారంభించాలని చెప్పారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీలలో చేపట్టే పనులకు అధికారికంగా ఆమోదం లభించిందని, భూమి పూజ చేసే కార్యక్రమాల ఫొటోలను తప్పనిసరిగా పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని సూచించారు. గ్రౌండింగ్ చేసిన పనులన్నీ జియోట్యాగ్ చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టే పనులు గ్రామాలకు స్థిరాస్తిగా నిలిచిపోతాయని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. పంచాయతీశాఖ ద్వారా రూ.76.66 కోట్లతో 670 పనులు చేస్తున్నారని చెప్పారు. వాటికి అధికారికంగా అనుమతులు లభించడంతో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశామని పేర్కొన్నారు. పంచాయతీలోని సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మరో 564 పనుల్ని రూ.11.91 కోట్లతో చేపడుతున్నామని వెల్లడించారు. తాజాగా మరో 130 పనులకు అధికారికంగా ఆమోదం తెలిపినట్లు వివరించారు. చేపడుతున్న అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ హరే రామకృష్ణ, డీఎల్‌డీవో సువార్త, మండలాల నుంచి ఎంపీడీవోలు పాల్గొన్నారు.



జువ్వలపాలెం, గాజర్లంక నుంచి ఇసుక తవ్వకాలు

బాపట్ల: ఉచిత ఇసుక విధానంలో జిల్లాలో రెండు రేవుల నుంచి తవ్వకానికి కలెక్టర్ జె. వెంకట మురళి అధికారికంగా ఆమోదం తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాలైన కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుర్లంక గ్రామాలలో ఇసుక లభ్యత ఉన్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఒక్కొక్క రేవు వద్ద 74 వేల టన్నులకు పైగా ఇసుక లభ్యత ఉన్నట్లు తెలిపారు. జీవో ఎంఎస్ నంబర్ 40 ఆధారంగా రేవుల నుంచి ఇసుక తవ్వడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ టెండర్ దశలో ఉందని, గురువారం సాయంత్రం దరఖాస్తులు గడువు ముగుస్తుందని తెలిపారు. ఇసుక రేవుల వద్ద అక్రమ తవ్వకాలు నియంత్రించాలని అధికారుల్ని ఆదేశించారు. అక్రమ తవ్వకాలు, రవాణా అరికట్టడానికి ఇద్దరు ఉప తహసీల్దార్లు, ముగ్గురు ఆర్ఐలు, పోలీసులను కలిసి కమిటీగా నియమించామని కలెక్టర్ తెలిపారు. నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తొమ్మిది చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ఉండాలని ఆదేశించారు. ఇసుక కొనుగోలుపై రూపొందించిన ప్రత్యేక యాప్‌పై సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, మైన్స్ ఏడీ రాజేష్, అనుబంధ శాఖల అధికారులు, ఆర్‌డీఓ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మనోవేదన

- విధుల్లోకి చేర్చుకోని ఎంపీడీఓలు
- బదిలీ అయిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇబ్బందులు
- కలెక్టర్ ఉత్వర్వులు చిత్తు కాగితాలేనా?

చీరాల టౌన్: సచివాలయాల ఉద్యోగులకు తిప్పలు వచ్చి పడ్డాయి. కలెక్టర్ బదిలీ ఉత్వర్వులు సరిపోవని..ఎమ్మెల్యేల రిఫరెన్స్ లెటర్లు తీసుకు రావాలనే విచిత్ర నిబంధనలతో మనో వేదనకు గురవుతున్నారు. మంగళ, బుధవారాల్లో కలెక్టర్ ఉత్వర్వులతో గ్రామ సచివాలయాల ఉద్యోగులను బదిలీ చేసి.. రిలీవ్ ఆర్డర్లు కూడా అందజేశారు. మండల పరిషత్ అధికారులు మాత్రం స్థానిక ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్లు తీసుకురావాల్సిందేనంటూ పేచీ పెట్టారు. సచివాలయాల ఉద్యోగులను విధుల్లోకి చేరనివ్వకుండా మోకాలు అడ్డుపెడుతూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు.

ఇదీ సంగతి..

కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను బదిలీ చేసింది. నియోజకవర్గంలోని చీరాల మండలంలో 22, వేటపాలెం మండలంలో 18 గ్రామ సచివాలయాలున్నాయి. వీటిలో పనిచేస్తున్న వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు అందించారు. జిల్లా కలెక్టర్ రిలీవ్ ఆర్డర్లు ఇచ్చి వారికి కేటాయించిన సచివాలయాలకు పంపించారు. అయితే, ఇక్కడే సచివాలయాల ఉద్యోగులకు.. టీడీపీ ముఖ్య నేత ఆర్డర్ వ్యవహారం అడ్డు పడింది. సచివాలయాల ఉద్యోగులంతా విధిగా స్థానిక ఎమ్మెల్యే నుంచి రిఫరెన్స్ లెటర్ తీసుకువస్తేనే విధుల్లో చేర్చుకుంటామని మండల పరిషత్ అధికారి ఆదేశాలిచ్చారు దీంతో నివ్వెరపోయిన సచివాలయ ఉద్యోగులు "మాకేం కర్మ..ఉద్యోగంలో జాయిన్ అవ్వడానికి కలెక్టర్ ఆర్డర్ కంటే ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్ తీసుకురావాలా?" అని తెల్లమొఖాలు వేశారు. చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో సుమారు 45 మంది సచివాలయాల ఉద్యోగులు పోస్టింగ్‌ల కోసం ఎంపీడీవో కార్యాలయం ముందు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఇసుక దొరక్క బతుకులో చీకట్లు

- పనుల కోసం భవన నిర్మాణ కార్మికులు పడిగాపులు
- ఇసుక లేక రెండు నెలలుగా అవస్థలు
- కూటమి ప్రభుత్వం రాకతో కుదేలైన భవన నిర్మాణ రంగం
- ఉచితం అంటూ ఆర్భాటంగా ప్రకటన
- పస్తులతో కాలాన్ని వెళ్లతీస్తున్న కూలీలు
- ట్రక్కు ఇసుక రూ. 8వేలు



పనుల కోసం గడియార స్తంభం సెంటర్‌లో పడిగాపులు కాస్తున్న భవననిర్మాణ కార్మికులు

బాపట్ల టౌన్: " మేము అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా అందజేస్తాం.. కొరత లేకుండా చూస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇసుక అందించడమే మా లక్ష్యం" అంటూ ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు కూటమి నేతలు. అధికారంలోకి వచ్చాక ఉచితంగానే అందిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారు. ఉచితం సంగతి దేవుడెరుక...ట్రక్కు ఇసుక రూ. 7 నుంచి 10 వేలు చెల్లించి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం దాపురించింది. వేలాది రూపాయలు చెల్లించినప్పటికీ అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలను యజమానులు అర్ధంతరంగా ఆపేశారు. దీంతో పనుల్లేక భవననిర్మాణ కార్మికులు పొట్టకూటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రభుత్వ ఆచరణేది ?

కూటమి నేతల ఉచిత ఇసుక హామీ బూటకంగా మారింది. పనులు అర్ధతరంగా నిలిచిపోతున్నాయన్న బాధతో ఇంటి యజమానులు అర్ధరాత్రి ట్రాక్టర్లు, ఎద్దుల బండితో దొంగతనంగా తోలుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా ఒక్కో ట్రాక్టర్ రూ. 8 నుంచి 10 వేలు వరకు చెల్లించాల్సి వస్తోంది. ఎద్దుల బండి అయితే ఏకంగా రూ. 3500 చెల్లిస్తేనే ఇసుక తోలుతున్నారు. ఇదేనా ఉచితం అంటే అంటూ భవన నిర్మాణ యజమానులు కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

నిరాశతో వెనుతిరుగుతున్న కార్మికులు

జిల్లా కేంద్రమైన బాపట్ల గడియార స్తంభం సెంటర్‌కు ప్రతిరోజు 200 మంది భవన నిర్మాణ కార్మికులు పనుల నిమిత్తం వస్తుంటారు. వీరంతా ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. పనుల కోసం వచ్చి నిరాశతో వెనుతిరుగుతున్నారు. గడిచిన రెండు నెలలుగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో చేతిలో పనుల్లేక...పూట గడవక కార్మికులు అల్లాడిపోతున్నారు. ప్రతిరోజూ చార్జీలు పెట్టుకొని పనుల కోసం వేకువజామునే గడియార స్తంభం సెంటర్‌కు చేరుకోవడం, మధ్యాహ్నం 11 గంటల వరకు అక్కడే పడిగాపులు పడుతున్నారు. చివరికి పనుల్లేక నిరాశతో వెనుతిరుగుతున్నారు.



పనుల కోసం ఎదురు చూస్తున్న కూలీలు

ఇసుక లేకపోవడంతోనే ఈ పరిస్థితి



నేను తాపీమేస్త్రీగా పని చేస్తుంటాను. నేను పనిచేసే చోట ఆగస్టులో కొత్త గృహానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. అక్కడే మూడు నెలల వరకు పని దొరికేది. ప్రస్తుతం ఇసుక లేకపోవడంతో యజమాని పనులు ఆపేశారు. దీంతో ప్రతిరోజు పని దొరుకుతుందేమోనన్న ఆశతో రావడం, నిరాశతో వెనుతిరిగి వెళ్లటమే జరుగుతోంది.

– ఎం. అనిల్‌కుమార్‌రెడ్డి, రెడ్డిపాలెం, పిట్టలవానిపాలెం మండలం

చేతిలో చిల్లిగవ్వ లేదు



రెండు నెలల నుంచి ప్రతి రోజు పనుల కోసం బాపట్లలోని గడియార స్తంభం సెంటర్‌కు రావడం...మధ్యాహ్నం వరకు ఉండి పనుల్లేక తిరిగి వెళ్తున్నాం. రెండు నెలలుగా ఇదే పని. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేద్దామనుకుంటే అవి కూడా లేవు. చేతిలో చిల్లిగవ్వలేక పస్తులతో కాలాన్ని వెళ్లదీస్తున్నాం.

– నంగు వెంకటేశ్వరరెడ్డి, కర్లపాలెం

అప్పులు తెచ్చుకొని తింటున్నాం



గడిచిన రెండు నెలలుగా పనులు చేద్దామంటే ఇసుక లేని కారణంగా భవన నిర్మాణ పనులు నిలుపుదల చేశారు. కనీసం పొలం పనులకైనా వెళ్దామనుకుంటే ప్రస్తుతం అవి కూడా లేవు. వారం కనీసం ఒక్కరోజు కూడా పని దొరకడం లేదు. ఇల్లు గడవటం కూడా కష్టంగా మారింది. అప్పులు తెచ్చుకొని పబ్బం గడపాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు.

– పి. వెంకటేశ్వరరావు, తవ్వ కాలువ సెంటర్, బాపట్ల

పొలం పనులు కూడా లేవు



గడిచిన రెండు నెలలుగా ఇసుక లేని కారణంగా భవన నిర్మాణ పనులు నిలుపుదల చేశారు. కనీసం పొలం పనులు కూడా లేవు. వారం కనీసం ఒక్కరోజు కూడా పని దొరకడం లేదు. ఇల్లు గడవటం కూడా కష్టంగా మారింది. అప్పులు తెచ్చుకొని పబ్బం గడపాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు.

– శ్రీను, మున్సిపల్ ఆఫీస్ బజార్ , బాపట్ల

ఉచితం అన్నారు...పస్తులు పెడుతున్నారు



ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగానే అందజేస్తామని చెప్పారు. ఇది నిజమేనని జనం మొత్తం నమ్మారు. తీరా ఒక్కరోజు కూడా ఉచితంగా ఇసుకను అందించిన దాఖలాలు లేవు. కనీసం డబ్బులు పెట్టి కొనుగోలు చేసేందుకు కూడా దొంగతనంగా రాత్రివేళల్లో కొట్టుకురావాల్సి వస్తుంది. ప్రస్తుతం పనుల్లేక పస్తులు ఉంటున్నాం.

– దేగల శ్రీనివాసరావు – బాపట్ల

క్లుప్తంగా

ఆర్డీవోగా రామలక్ష్మి బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె ఆర్డీవోగా నేలపు రామలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై రేపల్లె వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన హేలా షారోన్ ఉయ్యూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పలువురు తహసీల్దార్‌లు, ఇతర రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్సీ శిక్షణకు అవకాశం

నెహ్రూనగర్: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 5050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సోషల్ వెల్ఫేర్ డీడీ డి.మధుసూదన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ కేంద్రాల్లో, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. దీని కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. గత డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో శిక్షణ పొందిన వారిలో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఎంపికై ఉండాలన్నారు.

సాగర్ కాలువలో మృతదేహం

మార్టూరు: మండలంలోని జంగమహేశ్వరపురం రెవెన్యూ పరిధిలోని సాగర్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికి తీయించారు. హెడ్ కానిస్టేబుల్ యు. కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. జంగమహేశ్వరపురం సమీపంలోని టి. జంక్షన్ వద్ద సాగర్ కాలువలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వలపర్ల వీఆర్వో వి. అశోక్ సమక్షంలో మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీయించి పరీక్షించారు. సుమారు 40 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతదేహంపై ఎలాంటి దుస్తులు, ఇతర ఆనవాళ్లు లేవని చెప్పారు. వీఆర్‌ఓ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖజానా ఉద్యోగులపై చర్యలు

విచారణాధికారి ఆర్‌ఎఎస్ కుమార్



చీరాల ఎస్టీఓ కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారుల బృందం

చీరాల టౌన్: ఇటీవల తమకు కాసులు వచ్చే సీట్లు దక్కలేదని ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేయడంతో పాటు బిల్లులను పాస్ చేయకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇలా అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఖజానా ఉద్యోగులపై ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకుంటుందని విజయనగరం జిల్లా జిల్లా ఖజానాధికారి (డీటీవో), విచారణాధికారి ఆర్‌ఎఎస్ కుమార్ తెలిపారు. విచారణ అధికారుల బృందం 2021 నుంచి 2024 సెప్టెంబర్ వరకు చేసిన బిల్లుల మంజూరు, కాంట్రాక్టర్లు బిల్లులు పాస్, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు, ఇతర అలవెన్సుల మంజూరు బిల్లులు .. ఇలా చేపట్టిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. సస్పెండ్ అయిన చీరాల ఎస్టీవో భాగ్యలక్ష్మిని, సీనియర్ అకౌంటెంట్ సుధీర, ఇతర జిల్లాలకు బదిలీ అయిన పూర్వ ఉద్యోగులు సుజాత, సోనియా, లక్ష్మి, రాజేశ్వరి, సుజాతలను పిలిపించారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులు, మీడియాలో వచ్చిన కథనాలు, అధికారులు, సిబ్బంది చేసిన అక్రమాలపై ఉన్నతాధికారులు అసహనానికి గురయ్యారు. చీరాలకు రెగ్యులర్ ఉపఖజనా అధికారిగా నియమించే వరకు ఇన్‌చార్జి ఎస్టీవోగా ఉన్న బాపట్ల ఎస్టీవో సుబ్బారావు నుంచి పలు వివరాలను, సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విచారణాధికారులు మాట్లాడుతూ తమ విచారణలో వచ్చిన ప్రతి అంశాన్ని ఖజానా డైరెక్టర్‌కు అందిస్తామని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజుల పాటు జరిగే విచారణ నివేదికలు ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. బృందంలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎస్. మోహనరావు, విజయనగరం జిల్లా డీటీవో కుమార్, విజయనగరం ఎస్టీవో ఐ.రమేష్ ఎస్టీవో, శ్రీకాకుళం ఎస్టీవో ఎం.తులసీరావు, కర్నూలు, గుంటూరు, విజయవాడ ఎస్టీవోలు సురేష్‌కుమార్, ఫయాజ్ అహ్మద్, అంజాద్ బాషా ఉన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా వైఎస్సార్ సీపీ



చెక్కు అందిస్తున్న రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గణేష్

చెరుకుపల్లి: కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని రేపల్లె నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ గూండాల చేతిలో గాయపడిన ఆరుంబాక పంచాయతీకి చెందిన వేమూ కిరణ్‌కుమార్‌కు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అందిన రూ.50 వేల చెక్కును బుధవారం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో అందించి, మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే వైఎస్సార్ సీపీ బాటలో కార్యకర్తలు పయనించి నూతనోత్సాహంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రెండు ఆటోలు, 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
అదుపులో ముగ్గురు నిందితులు, ఒకరు పరారీ



నిందితులు, ద్విచక్ర వాహనాలతో సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: అంతరాష్ట్ర దొంగలను పిడుగురాళ్ల పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించటంతో అదుపులోకి తీసుకొని విచారించామని వారు దొంగతనాలు చేసే వారిగా గుర్తించటం జరిగిందన్నారు. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వేముల హనుమంతరావు, కొండపల్లి ఆంజనేయులు, కారంపూడి మండలం పేట సన్నిగండ్ల గ్రామానికి చెందిన పెల్లూరి ఆంజనేయులను అదుపులోకి తీసుకొని విచారణ చేశామని వారి వద్ద నుంచి రెండు ఆటోలు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. వీటి విలువ సుమారు రూ. 8 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. వీరు హైదరాబాద్ హస్తినాపురం, వనస్థలిపురం, నార్కట్‌పల్లి, పిడుగురాళ్ల పట్టణం పట్టణాల్లో దొంగతనాలు చేస్తూ ఉండే వారని తెలిపారు. వీటిల్లో 4 మోటార్ వాహనాలను రామోహన్ అనే వ్యక్తి దొంగలించాడని, అతను ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. వీరందరినీ గతంలో దొంగతనాలు చేస్తే పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకొని వారిని అరెస్టు చేసి గురజాల సబ్ జైలుకు పంపించటం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేయటం జరుగుతుందని సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. సమావేశంలో నాగరాజు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఆరా తీసినట్లు తెలిసింది. ప్రత్తిపాడు వడ్డెర కాలనీకి చెందిన మహిళలకు గుంటూరుకు చెందిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణాలిచ్చి, ఈఎంఐలు కట్టలేదని వేధిస్తున్నాయి. అర్ధరాత్రి ఇళ్లకు వచ్చి వేధిస్తున్నారని, రుణం కట్టలేకపోతే చచ్చిపోవాలని, ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకుని రుణాలు రద్దు చేస్తామంటూ ప్రతినిధులు దాష్టీకానికి పాల్పడుతున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'మళ్లీ పల్లెల్లో పడగ' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించినట్లు సమాచారం. డీఆర్డీఏ పీడీని ఈ విషయమై ప్రశ్నించి, పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించినట్లుగా తెలిసింది.

తక్కువ ధరకే వంట నూనె అందించేలా చర్యలు

గుంటూరు వెస్ట్: వంట నూనెల దిగుమతి విషయంలో కేంద్రం సుంకాలను పెంచడంతో లీటర్‌కు రూ.12 నుంచి రూ.16 వరకు పెరిగాయని డీఎస్‌ఓ కోమలి పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత మార్కెట్‌లో రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.135, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.140 వరకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్‌తో చర్చించి తాము రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.120, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ. 130 చొప్పున విక్రయించున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైతు బజార్, చుట్టగుంట రైతు బజార్‌తోపాటు బండ్లబజార్ దుకాణాల్లో గురువారం నుంచి పైన తెలిపిన ధరలకు విక్రయాలు జరుగుతాయని తెలిపారు.

యార్డుకు 37,958 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 37,958 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,741 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,700 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,900 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,585 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అధికార పార్టీకి కొమ్ము కాయడం తగదు

- తొలగించిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
- ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు డిమాండ్



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నరసరావుపేట: ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ చిరుద్యోగులను తొలగించడం తగదని, తొలగించిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు.. రాజకీయ వేధింపులు నేపథ్యంలో వేటుకు గురైన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గత 10 రోజులు నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన అధికారులు పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ చిరుద్యోగులు పట్ల రాజకీయ వేధింపులు తగదని ఏ రకమైన రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గకుండా చట్టప్రకారం వ్యవహరించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అధికారులు ఉన్నారన్నారు. వారెంతో ప్రజాదరణ పొందారని, అధికారుల ప్రజాప్రతినిధులను తీరును సున్నితంగా తిరస్కరించి చిరుద్యోగుల పక్షాన నిలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. యూనియన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు మాట్లాడుతూ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు పోరాటం చేస్తామన్నారు. విధుల్లోకి తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును అడిగితే రెండు నెలల తర్వాత చూద్దాం చేద్దాం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, దీక్షలకు పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిలార్ మసూద్, ఎస్.డి రబ్బానీ, మున్సిపల్ ఉద్యోగులు బత్తుల నాగమల్లేశ్వరి, శివరాత్రి రమాదేవి, షేక్ మహబూబ్ సుభాని, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైదా, పోలూరి రమణ, షేక్ మహబూబ్ సుభాని, షేక్ షైలు,అక్కి పద్మ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు–3, ఫార్మసిస్టులు–11, డేటా ఎంట్రీ ఆపరేటర్లు–11, శానిటరీ అటెండర్లు–15 కలిపి మొత్తం 40 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు డీడీ జత చేసి గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈనెల 16 నుంచి 30వ తేదీలోపు అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ. 100, బీసీ, ఓసీలు రూ. 300 వంతున డి.డి. చెల్లించి దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. ఓ.సి అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో, దరఖాస్తు సమర్పించేటప్పుడు అదనంగా రూ. 500 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మిగిలిన వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రోపాధ్యాయ సంఘం
రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు చెప్పారు. ఎస్టీయూ సమావేశం సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహించనున్న క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై చర్చించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకంతో పాటు 30 శాతం మధ్యంతర భృతి, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తొలగించాలని కోరారు. సంఘ ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాష్, షేక్ మగ్బుల్‌బాష, దుర్గాప్రసాద్, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

జీఎంసీ ఉత్తర్వులపై హైకోర్టుకు చిరు వ్యాపారులు

- షాపుల లీజు కొనసాగేలా ఆదేశాలివ్వాలని పిటిషన్
- నేడు విచారణ చేపట్టనున్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

సాక్షి, అమరావతి: గుంటూరు పట్టణం, కొరిటెపాడు కూరగాయల మార్కెట్‌లోని షాపులను ఖాళీ చేయాలంటూ గత నెల 26న గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. చిరు వ్యాపారుల మరియు చేతివృత్తుల సంక్షేమ సంఘంతోపాటు అక్కడ వ్యాపారం చేసుకుంటున్న పలువురు కోర్టుకెళ్లారు. జీఎంసీ ఉత్తర్వులను రద్దు చేయాలని, తమకు లీజుకిచ్చిన షాపుల్లో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది. 2004 నుంచి తాము కొరిటెపాడు లైబ్రరీ సెంటర్ రోడ్డు వెంబడి బండ్లపై కూరగాయలు విక్రయించేవారమని, తమ నుంచి జీఎంసీ పన్ను కూడా వసూలు చేసిందన్నారు. తరువాత ఆ పక్కనే ఉన్న కూరగాయల మార్కెట్‌లో తమకు షాపులకు లీజుకు కేటాయించారని తెలిపారు. వాటిని తాము సొంత ఖర్చుతో నిర్మించుకున్నామని వివరించారు. 2004–05 నుంచి జీఎంసీ అధికారులు ఒక్కో షాపునకు నెలకు రూ.2,350 చొప్పున లీజు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. కొంత సొమ్ము వసూలు చేసి షాపులను క్రమబద్ధీకరించేందుకు అనుమతినిస్తూ జీఎంసీ పాలకవర్గం 2009–10లో తీర్మానం కూడా చేసిందన్నారు. ఈ లీజు కాలం 25 సంవత్సరాలు పూర్తయినందున షాపులను ఖాళీ చేయాలంటూ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారని, అందుకు తాము సమాధానం కూడా ఇచ్చామన్నారు. 2004–05లో ఒప్పందం కుదిరిందని, ఇంకా 25 ఏళ్ల పూర్తి కాకున్నా కూడా అధికారులు ఖాళీ చేయాలంటున్నారని పేర్కొన్నారు. 2030 వరకు తమకు గడువు ఉందన్నారు. ఈ షాపులే తమకు జీవనాధారమని, వాటిని ఖాళీ చేయిస్తే రోడ్డున పడుతామని వ్యాపారులు తమ పిటిషన్‌లో కోర్టుకు విన్నవించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ మహేంద్ర

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి బంగారం సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. స్థానిక రైల్వే జంక్షన్‌లోని జీఆర్పీ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సింగంరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తరచుగా రైళ్లలో ప్రయాణిస్తూ నిద్రలో ఉన్న ప్రయాణికుల బ్యాగులను అపహరించడం, కిటికీ వద్ద కూర్చొన్న మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లడం వంటి చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు జీఆర్పీ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు వెలుగు చూశాయి. నిందితుడిని అరెస్ట్ చేసి, 60 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.

14న తెనాలి ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్ మేళా

తెనాలి అర్బన్: తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న పీఎం నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన్నవెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. 15 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్ 90144 91772, 99598 28100 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లాటరీ నిర్వహణపై ఉక్కుపాదం మోపుతాం

సత్తెనపల్లి: లాటరీ నిర్వహణపై ఉక్కుపాదం మోపుతామని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిషేధిత లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ఐదుగురు నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల తారక రామాసాగర్ గేటు ఎదురు గల గుర్రం జాషువా విగ్రహం వద్ద నిషేధించిన లాటరీ టికెట్లు అమ్ముతున్నందున పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అరెస్ట్ అయిన వారిలో గంటా నారాయణ రెడ్డి, షేక్ కరీముల్లా అలియాస్ నన్నే కరీం, షేక్ సిలార్, మరడ శ్రీనివాసరావు, ఒంటిపులి శ్రీనులను అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో ఆయనతో పాటు సత్తెనపల్లి టౌన్ సీఐ బొప్పన బ్రహ్మయ్య, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐలు పవన్‌కుమార్, ఎమ్.సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: మండల కేంద్రంలో నిషేధిత లాటరీ విక్రయాలు చేస్తున్న 10 మందిని బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ హనుమంతరావు వెల్లడించారు. నకరికల్లుకు చెందిన మాడిశెట్టి సుబ్బారావు నరసరావుపేటకు చెందిన పూర్ణ అనే వ్యక్తి ద్వారా నిషేధించబడిన బోడో లాంట్ లాటరీ టికెట్లు తెప్పించుకొని నకరికల్లుకు చెందిన వ్యక్తిని గుమస్తాగా పెట్టుకొని 10 శాతం లాభంతో మరికొందరికి విక్రయించి వారి ద్వారా గ్రామంలో విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి కొత్త సుబ్బారావు, షేక్.మహ్మద్ జాను, షేక్.మాబు సుభాని, సంగుల గురవయ్య, దేసు సాంబశివరావు, షేక్.మస్తాన్‌వలి, చెరుకాటు కుమార్, చెరుకూరి రవీంద్ర, మన్నెం కొండలు, నాగేశ్వరరావు, కాశంగి సాయి, కాశంగి శ్రీను తదితరులు నకరికల్లు గ్రామంలో విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించామన్నారు. నకరికల్లు పంచాయతీ కార్యాలయం వద్ద 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద లాటరీ పేర్లు గల ఏడు తెల్లపేపర్ స్లిప్పులు, రూ.2,300ల నగదు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. లాటరీ విక్రయదారులను అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ చల్లా సురేష్‌కు రివార్డు ప్రకటించామని అన్నారు. ఏఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు అవకాశం కల్పించింది. ఈ గడువును 11వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ బుధవారం తెలియజేశారు. గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129 షాపులకు నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి వరకు గుంటూరుకు 2,944, పల్నాడుకు 1,635 దరఖాస్తులు అందాయన్నారు. గడువును 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు సర్కారు పొడిగించిందని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎవరైనా ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 14వ తేదీన ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీసి కేటాయిస్తారని, 16 నుంచి షాపుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

మధుశాలినికి అభినందనలు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్–19 బాలికల రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పట్టణానికి చెందిన కుంచాల మధుశాలినికి బుధవారం ఏసీఏ మాజీ క్రీడాకారుడు ఆర్.దుర్గాప్రసాదు క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. మహిళా క్రికెట్‌లో మధుశాలిని నిరంతర కృషితో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మాజీ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.